# దేశానికి వెన్నెముకలు

సిహెచ్. యస్. ధర్మజ్ఞాని

అదొక స్కూలు అనటానికంటే గొడ్ల చావిడి అంటే బాగుంటుందేమో! అంత వరకు అక్కడ పశువులున్నట్లు మరకలు, చెత్త చిందర వందరగా ఉంది. పైన కప్పిన కప్పు చాలావరకు గాలికి ఎగిరిపోయి కంతలు ఏర్పడి, సూర్యకిరణాలు నిరభ్యంతరంగా దూసుకొని వస్తూన్నాయి. మట్టి గోడలు అసహ్యంగా ఉన్నాయి. స్కూలు ఆవరణలో నలుగు రైదుగురు గోళీకాయ లాడుకుంటున్నారు. చాలా కాలంగా గాలీ, ఎండా వానలతో మొండిగా పోరాడి చివరకు, నిస్పృహాయంగా, దీనస్థితిలో వుంది స్కూలు.

ఆ స్కూలు ఆకారం చూసిన చంద్రం ఆశ్చర్యపోయాడు. టీచర్లు, విద్యార్థులు లేని ఆ స్కూలుని చూస్తున్న చంద్రంకు అది స్కూలేనా! అన్న అనుమానం వచ్చింది. బండినుండి సామాను దించిన పాలేరు, స్కూల్లో ఒకప్రక్కగా సామాను సదిరి, ఓ తడిక అడ్డంగా కట్టి వెళ్ళిపోయాడు.

చంద్రంని ఆ ఊళ్ళో, ఆ స్కూల్లో హెడ్ మాస్టరుగా కొత్తగా అప్పాయింట్ చేశారు అప్పుడే పట్టణంలో చదువు పూర్తి చేసి వచ్చిన చంద్రంకు పల్లె వాతావరణం విచిత్రంగా తోస్తూ ఉంది. కానీ— తప్పదు. డబ్బులు పోస్తే తప్ప ఉద్యోగాలు దొరకని ఈ రోజుల్లో మొట్ట మొదటగా వచ్చిన అవకాశం కాదనలేక పోయాడు చంద్రం. హత్యలకూ పార్టీలకు దౌర్జన్యాలకూ ఆ వూరు ప్రసిద్ధని పేరు.

కాని!— మనుగడ కోసం, తనవాళ్ళ కోసం, చేయాలి.

తప్పదు!—

"కొత్త పంతులొచ్చాడోయ్!" కొందరు పిల్లలు చంద్రంని చూసి అరుస్తూ పరుగెత్తారు. గ్రామ ప్రజలంతా చిత్రంగా చూస్తున్నారు.

ఆ రోజు స్కూలు ఎందుకు సెలవోనని ఆలోచిస్తూ, గ్రామ ప్రెసిడెంటు గారిల్లు వెదుక్కుంటూ బయలుదేరాడు చంద్రం. ఆ వూళ్లో ఉన్నవి వందయిళ్ళు కాబట్టి అట్టే శ్రమ పడనక్కర్లేక పోయింది.

"ప్రెసిడెంటుగారున్నారా?"

యింటి ముందు వసారాలో నిల్చున్న యిద్దరు పాలేళ్ళని అడిగాడు, ఆ యింటిని పరికిస్తూ. పల్లెటూరి నాగరికత అంతా ప్రతిబింబిస్తూన్నట్లుందా యిల్లు. యింటి ముందు పెద్ద బయలు వసారలో గోడలకు రెండు మూడు నాగళ్ళు ఆనించబడి వున్నాయి. పాలేళ్ళు జవాబు చెప్పలేదు. చిత్రంగా చంద్రంని పరిశీలిస్తూండి పోయారు.

మళ్ళీ ఓ సారి గట్టిగా అడిగాడు చంద్రం.

వాళ్లు జవాబు చెప్పేలోగా, లోపలినుండి మెరుపు తీగలాగ ఓ అమ్మాయి వచ్చింది. "ఎవరూ?" అంటూ.

పసిమి పచ్చని ఛాయ. గుండ్రటి కళ్ళు. వయసు రెండు పదులుండొచ్చు. కానీ ముఖంలో పసితనం పోనట్లు అమాయకంగా చదువుకున్నట్లు ఆ అమ్మాయి ముఖం చెబుతూ ఉంది.

"నేను.... ఈ ఊరికి కొత్తగా అపాయింటయిన టీచర్నండి!.... ఇవ్వాళే యిప్పుడే వచ్చాను. ప్రెసిడెంటు గారితో మాట్లాడాలి." చంద్రం అన్నాడు

"నాన్నగారు లేరండీ.... తోటకి వెళ్ళారు. సాయంత్రం దాకా యింటికి రారు అర్జంటుగా కలుసుకోవాలనుంటే అక్కడికే వెళ్ళండి పాలేరు మీ వెంట వస్తాడు"

"అలాగే వస్తానండి థ్యాంక్స్!"

ఈ వినీత ప్రెసిడెంటుగారి కూతురు కాబోలు, అందుకే ఆ దర్పం. అనుకుంటూ పాలేరుని వెంబడించాడు చంద్రం.

తోటలో మామిడిచెట్టు క్రింద కుర్చీలో చుట్ట కాలుస్తూ, కాలుమీద కాలువేసుకుని, దర్పం ఒలకబోస్తూ, పాలేళ్ళకి పనులు పురమాయిస్తూ కూర్చున్నాడు ప్రెసిడెంటు గారు

"రెడ్డిగారూ యీయన మనూరికి కొత్త పంతులు గారట" వెంట వచ్చిన పాలేరు చంద్రం గురించి చెప్పాడు.

"నమస్కారమండీ!" చంద్రం ఫార్మాలిటీస్ మరచి పోలేదు.

"నీవేనా! టీచర్వి?" తలను ముందుకు వూపి అతడి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు ప్రెసిడెంటు

పొగరుగా, గర్వంగా ఉందాయన కంఠం. చంద్రంకు వళ్ళు మండింది. కానీ!— అంతలోనే అణచుకొన్నాడు. తానొక టీచర్ననీ, ఆ స్కూలుకి హెడ్మాస్టర్ననీ గౌరవం లేకుండా. కనీసం కూర్చోమని కూడా చెప్పలేదు ఇంటర్వ్యూలో ఆఫీసరు ముందు కాండిడేటు లాగా నిలబడ్డాడు చంద్రం.

"అవునండి!" జవాబిచ్చాడు చంద్రం.

బుంగ మీసాలు, భారీ శరీరం. తల వెంట్రుకలు అక్కడక్కడా నెరిశాయి జరీ పంచె కట్టు. తెల్లటి జుబ్బా స్థూల దేహం. అధికారం దర్పం ఆయనలో తొణికిసలాడుతున్నాయి.

"ఊఁ నీ పేరేమిటి?" రెండవ ప్రశ్న.

"జేమ్స్ చంద్రమోహన్" సహనంతో జవాబిచ్చాడు

"పూర్తిగా ఉండిపోవటానికే వచ్చావా?" మూడవ ప్రశ్న.

"అంటే! మీ ఉద్దేశ్యం!" అర్థంగాక ఎదురు ప్రశ్న వేశాడు చంద్రం.

"పట్నం నుండి వచ్చిన వాళ్ళెవరూ సరిగా పని చేయలేదు

ఆరిపోయిన చుట్టని వెలిగించుకుంటూ అన్నాడు ప్రెసిడెంటు.

"అలాటి ఉద్దేశ్యం నాకు లేదు

"రామయ్య పంతులు పనిమీద పొరుగూరెళ్ళాడు అందువల్ల ఈ రోజు స్కూలు తెరవలేదు

"ఇద్దరు టీచరు గదా! మరో చరు?

"ఆ లేడీ టీచరు.... ఈ మధ్యే రాజీనామా చేసి వెళ్ళిపోయింది. నీవు స్కూలు అభివృద్ధిలోకి వచ్చేట్లు చేయి. వెళ్ళు.

చంద్రం వెనక్కి తిరిగి వచ్చేశాడు

రెండు మూడు రోజులు గడిచి పోయాయి. చంద్రంకు ఆ స్కూలు పరిస్థితి పూర్తిగా అర్థమవసాగింది. స్కూలు రికార్డులో వంద మందికి పైగా విద్యార్థులున్నట్లు ఉంది. కాని స్కూలుకి వచ్చేవాళ్ళు ముప్పైకి దాటి లేరు ఇద్దరు టీచర్లని రికమెండ్ చేశారు. కాని ఉన్నది ఒక్కడే. ఇన్నాళ్ళూ జీతాలు ఏమై పోయాయో ఆ లేడీ టీచరు ఎందుకు రాజీనామా యిచ్చి వెళ్ళిందో మాత్రం అర్థంగాలేదు చంద్రంకు.

రామయ్య పంతులు సొంత ఊరు అదే కావటం వల్ల బాగా అక్కడి జీవితానికి

అలవాటు పడిపోయాడు. అంతవరకు అతడు పిల్లలకి చదువు చెప్పినట్లు లేదు. అసలు స్కూలు తెరిచినట్లుకూడా లేదు. ప్రెసిడెంటుగారి పనులమీద, తన సొంత పనులమీద వూళ్ళు తిరుగుతున్నట్లు మాత్రం అర్థమవుతుంది.

కానీ — ఒక్కటి మాత్రం నిజం అనిపించింది. రామయ్యపంతులు ప్రెసిడెంటుగారికి కుడిభుజం లాంటివాడని.

లేడీ టీచరు ఎందుకు రాజీనామా యిచ్చి వెళ్ళిందన్న ప్రశ్నకి సరైన సమాధానం ఎవ్వరూ చెప్పలేదు. పంతులు రామయ్య మాత్రం పెదవి విరిచాడు. ఆవిడ గుణం మంచిది కాదనీ, తిరుగుబోతనీ, చదువు చెప్పే రకం కాదనీ, ప్రజల్లో తన మీద తిరుగుబాటు జరక్కముందే తెలివిగా, రాజీనామా యిచ్చి, ఒకడిని లేవదీసుకు పోయిందనీ చెప్పాడు. చంద్రానికి. అతని మాటల్లో సత్యం ఉన్నట్లనిపించలేదు.

"ఇదిగో .... పంతులో! మా పిలగాడికి సదుగు బాగ సెప్పాల!"

"ఎంది పంతులో! మా పిల్లది బళ్ళో కూకోకుండా యింటి కొచ్చింది. నువ్వేం చేస్తుండవ్? కొంచెం భయం పెట్టాల"

"పంతులో! ఆ యీరిగాని కొడుకు మా పిలగాణ్ణి తన్నిండట. యిట్టాగయితే ఆడి రకం కళ్ళసూత్తానని సెప్పు"

రోజూ, ఇలాటి మాటలకు అలవాటు పడిపోయాడు చంద్రం.

ఆరోజు ప్రెసిడెంటు గారు చంద్రాన్ని కబురుచేశారు. చంద్రంకు వెళ్ళక తప్పింది గాదు వెళ్ళాక తెలిసి వచ్చిందేమంటే తన అమ్మాయికి చదువుచెప్పాలిట, ఆ అమ్మాయి ఈ ఏడు స్కూలు ఫైనల్‌కి కట్టిందిట రోజూ సాయంత్రం ఓ గంటసేపు ట్యూషన్ చెప్పమన్నాడు. ఆ అమ్మాయి పేరు నీరజ.

చంద్రం ఒప్పుకోవటానికి కారణం ఆ అమ్మాయిలోని నమ్రత, అణకువ, గౌరవం అని చెప్పవచ్చు.

ప్రెసిడెంటుగారింటికి రోజూ సాయంత్రం వెళ్ళటం దినచర్య అయిపోయింది. నీరజ స్వతహాగా తెలివి గలది. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించేది.

ఆ రోజు వెళ్ళేసరికి పాలేరుని కొట్టినంత పని చేస్తున్నాడు ప్రెసిడెంటు. కారణం అట్టే తెలియక పోయినా పెద్ద తప్పు జరిగి వుండొచ్చను కున్నాడు చంద్రం. చివరకు మెడ పట్టి వీధిలోకి గెంటేశాడు. ప్రెసిడెంటు.

చంద్రంకు ఆశ్చర్యంగా ఉంది.

ఏమిటి నిరంకుశత్వం?

ఎంతటి అమానుషత్వం?

పాలేరు ఒక మనిషని ఎందుకు అనుకోరు?

ఆ పాలేరుద్వారా, తర్వాత విన్నచంద్రం అవాక్కయాడు. నమ్మలేని నిజంగా తోస్తూంది.

ఇది నిజమా? —

ఆ లేడీ టీచరును అంత దారుణంగా హింసించారా?

వీళ్ళు మనుషులా? రాక్షసులా?

ఒంటరిగా ఉద్యోగం చేసుకుంటున్న ఆడదంటే అంత చులకనా?

"బాబుగారు! ఆ రోజు నా కళ్ళెదుటే ఘోరం జరిగి పోయింది. నా కళ్ళ ముందే ఆ మహాతల్లి జీవితం నాశనం చేశారు బాబుగారు! ఆత్మాభిమానం గల ఆమె, జీవితంలో విరక్తి చెంది, తన వాళ్ళకు ముఖం చూపలేక ఊరిచివర చెరువులోదూకి ఆత్మహత్య చేసుకుని శాశ్వతంగా... ఈ కుళ్ళు, కామ పిశాచాలకి దూరంగా వెళ్ళిపోయింది బాబుగారు!"

పాలేరు కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

ఆనాటి సంఘటన ఊహిస్తూన్న చంద్రానికి వళ్ళు జలదరిస్తూంది ఇది ప్రత్యక్షంగా

చూసిన పాలేరు హృదయం క్షోభించటంలో వింతేముంది!

"లేక టీచరు రాజీనామా యిచ్చి వెళ్ళింది"

చంద్రంకు బిగ్గరగా నవ్వాలనిపించింది. కాని బాధతో గొంతుకూరుకొని పోయింది.

ఒళ్ళంతా మేకచర్మం కప్పుకున్న తోడేళ్లు! చంద్రం హృదయంలో ఆ నాటి సంఘటన అశనిపాతంలా నాటుకుని పోయింది.

"మాస్టారూ ఇవ్వాల్టికి పాఠం వద్దు!"

ఆ రోజు సాయంత్రం నీరజ పుస్తకం మూసి అంది.

"ఎందుకని నీరజా?" చంద్రంకు ఆశ్చర్యం వేసింది.

"ఇవ్వాళ తోటకి వెళ్ళాలి.... మీరూ నాతో రావాలి!"

"నేనా!"

"అవును మాస్టారూ!"

మరోసారి నీరజ బలవంతం చేయకుండానే చంద్రం వెళ్ళాడు. నీరజ వెంట

నీరజ కళ్ళు ఎంత ఆకర్షణతో మెరుస్తోన్నాయి. ఆమె ఒళ్ళంతా పరవశించిపోతూ ఉంది

"మాస్టారూ! మీరు చాలా మంచివారు." నవ్వుతూ మొదలుపెట్టింది నీరజ.

చంద్రంకు నవ్వు వచ్చింది.

"నిజం మాస్టారూ! మీరు నాతో గడిపేది ఒక గంట అయినా.... రోజంతా మీరు నాతో మాట్లాడుతూన్నట్లే ఉంటుంది. మీరు నా చెవి పట్టుకుని మెలిపెట్టినట్లే ఉంటుంది."

మళ్ళా నవ్వాడు చంద్రం.

"మీరలా నవ్వకండి మాస్టారూ! మీరు నాతో లేని క్షణాలు యుగాలవుతాయి. మనిద్దరిమధ్యా యీ అనుబంధం శాశ్వతం కావాలి—మాస్టారూ!"

చంద్రం పిడుగు పడ్డవానిలా ఉలిక్కిపడ్డాడు

"నీరజా!"

నీరజ చెక్కుచెదరలేదు. కళ్ళు హాయిగా, మత్తుగా అదో రకంగా మెరుస్తున్నాయి. అప్పుడే అరవిచ్చిన కలువమొగ్గలా ఉంది నీరజ

"అవును మాస్టారూ! మీరు లేని జీవితం నేనూహించలేను. పుట్టగానే తల్లిని కోల్పోయిన నేను తల్లి ప్రేమ ఎలాంటిదో చవిచూడలేదు. ఎప్పుడూ రాజకీయాలలో మునిగి తేలే నాన్నగారి అనురాగాన్ని అనుభవించలేదు. జీవచ్ఛవంలా, నిస్సారంగా బ్రతుకుతూన్న నా జీవితంలోకి అనురాగ అమృతభాండంలా మీరొచ్చారు. మీలో దండిస్తూన్న తల్లిని, మెత్తని మాటలతో లాలించే అనురాగపు విలువల్ని చూశాను. జీవితంలో మొట్టమొదటి సారిగా ఆత్మీయతలోని విలువల్ని అనుబంధాన్ని మీ ద్వారానే తెలుసుకున్నాను."

"నీరజా!"

"నన్ను మాట్లాడనివ్వండి మాస్టారూ!— కనీసం మీరయినా నా బాధని మనోక్షోభని అర్థం చేసుకున్నవారవుతారు"

"లేదు! నీరజా! శాశ్వతంగా నీకా అదృష్టం కలిగించేందుకు నేనశక్తుడ్ని—"

"లేదు మాస్టారూ! అలా అనకండి. మీరు కాదంటే నేనేమయిపోతానో ఊహించండి"

"నీరజా! మన బంధం కేవలం గురుశిష్యుల బంధం మాత్రమే!— పూర్తిగా అశాశ్వతం. నీకూ, నాకూ మధ్య అనురాగబంధానికి ఆకాశానికి, భూమికి ఉన్నంత దూరం ఉంది. సనాతన ఆచారాలలో, సాంప్రదాయ కుటుంబంలో, లక్షల రూపాయల మధ్య పుట్టి పెరిగిన నీవు— నేనేమిటో!— నా మతమేమిటో— అంతస్తేమిటో పూర్తిగా మరచిపోయావు"

"వీల్లేదు మాష్టరూ! మనిద్దరి మధ్యా పెరిగిన ఈ అనురాగలతని ఒక్క మతమనే అడ్డుగోడ ఏమీ చేయలేదు—"

"నీరజా తరతారాలుగా ఏ మహాత్ములూ

చేయలేని మార్పునూ సాహసాన్నీ నీ ఒక్కతెవూ చేయగలవా? అసంభవం. నీవు తండ్రి చాటు పిల్లవి నీ మీద ఎన్నో ఆశలు పెంచుకున్న "మీ తండ్రిని నీవు విస్మరించావు"

"మాస్టారూ, అనురాగం పంచలేని వారు తెంచి వేయనూ గలరు. నేను నాన్నకి, ఆచారాలకి, సంఘానికి భయపడ్డం లేదు—"

"నన్ను యిరకాటంలో పెట్టావు. నీరజా!"

"లేదు మాష్టారూ! మీరు ఆలోచించుకుని నిర్ణయానికి రండి. రోజులూ, వారాలూ, నెలలైనా సరే మీ కోసం మీ మాటకోసం ఎదురు చూస్తాను."

"పిచ్చి. నీరూ" పేలవంగా, నిస్సహాయంగా నవ్వుకున్నాడు.

మరునాడు స్కూల్లో పాఠాలు సరిగ్గా చెప్పలేకపోయాడు చంద్రం. నీరజను కాదని ఆమె పవిత్ర ఆరాధనని అపహాస్యం పాలుచేయలేడు. అలాగని నీరజను వివాహం చేసుకునే అంతస్తూ, స్తోమతా ధైర్యమూ లేదు. చెఱకు రసంపిండే చక్రాల మధ్య నలిగినట్లు విలవిలలాడాడు చంద్రం.

అంతలో స్కూలు ప్యూను పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు.

"స్కూళ్ళ ఇన్స్పెక్టరుగారు వచ్చారనీ, ప్రస్తుతం ప్రెసిడెంటుగారింట్లో ఉన్నారనీ"

ఆ కాస్తంత వ్యవధిలోనే స్కూలుని, పిల్లల్ని శుభ్రంగా, తయారుగా ఉంచాడు. ఎన్నాళ్ళుగానో తను రాసి ఉంచిన మెమోరాండంని తీశాడు. స్కూలుకి కావలసిన విషయాలూ, అక్కడున్న యిబ్బందులు, బిల్డింగ్ విషయం, స్కూలు స్ట్రెంగ్తు అన్నీ విషయాలు తయారు చేశాడు.

డిప్యూటీ ఇన్స్పెక్టరుగారి ద్వారా రికమెండ్ చేయిస్తే తప్ప, స్కూలు బాగు పడదనుకున్నాడు చంద్రం. అన్ని విషయాలు డి. ఐ. గారితో మాట్లాడవచ్చని సంతో

## రామచంద్రాపురంలో 'సంఘమిత్ర' ప్రారంభోత్సవము

3-11-74 (ఆదివారం నాటిరాత్రి 7గం॥కు) సంకుచిత కులమత తత్వాలకు అతీతంగా, హేతువాదం, శాస్త్రీయ దృక్పథంద్వారా, ప్రజలలో సామాజిక స్పృహను కలిగించుట, తద్వారా సౌభ్రాతృత్వమును పెంపొందించుట అనుధ్యేయముతో 'సంఘమిత్ర' అనే 'వక్తృత్వ, సాహిత్య సాంస్కృతిక సమితి వెలసింది.

తొలుత 'సంఘమిత్ర' అధ్యక్షులు శ్రీ రావి సుబ్బారావు, ముఖ్య అతిథులను సభావేదిక పైకి ఆహ్వానించారు.

గౌ॥ జస్టిస్ చిన్నపరెడ్డిగారు అధ్యక్షోపన్యాసములో 'సంఘమిత్ర' ఆశయాలను ఎంతగానో కొనియాడారు.

'సంఘమిత్ర' కార్యదర్శి శ్రీ దుత్తా బాబూరావు 'సంఘమిత్ర' ఆశయాలను సభకు తెలియ జెప్పారు.

ఆ తర్వాత శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీ సి. యస్. రావు శ్రీ తిలక్ (భూమి కోసం దర్శక నిర్మాత) కులమతాల పోకడల వల్ల భారతదేశం ఎంతగా కృంగిపోయిందో తెలియ చెబుతూ, సంఘమిత్ర ఆశయాలను హృదయ పూర్వకంగా బలపర్చారు.

ఉపన్యాసముల తదనంతరము G. P. O. కల్చరల్ అసోషియేషన్ వారు "ఊరుమ్మడి బ్రతుకులు" అనే నాటికను ఎంతో గొప్పగా ప్రదర్శించారు.

సంఘమిత్ర సభ్యులు శ్రీ చంద్రమౌళి వందన సమర్పణతో ఆనాటి కార్యక్రమం దాదాపు రెండువేల ప్రజలతో జయప్రదంగా ముగిసింది.

షించాడు.

కానీ !— మధ్యాహ్నం దాటింది.

స్కూలు వదిలారు. మధ్యాహ్నం స్కూలు తెరిచారు.

మూడుగంటలు దాటింది. స్కూలు మైమై పోయి, సాయంత్రం అయినా డి. ఐ. గారు వస్తున్నట్లు జాడ మాత్రం కనబడలేదు.

సాయంత్రం ఆరుగంటలు దాటింది. పక్షులు కిలకిల రావాలతో గూళ్లు చేరు కుంటోన్నాయి. చంద్రం ఆశ్చర్యంతో తల మునకలవు తున్నాడు, చివరకు ప్రెసిడెంటు గారింటి వద్దకు వెళ్లక తప్పిందికాదు.

డి. ఐ గారున్నట్లు జాడలేదు, ప్రెసి డెంటుగారు ఠీవిగా చుట్టకాలుస్తూ, కుర్చీలో కూర్చున్నారు.

"నమస్తే; డి.ఐ. గారొచ్చారని విన్నాను" చంద్రం అన్నాడు వినయంగా.

"అవును" చంద్రం వంక నిర్లక్ష్యంగా చూస్తూ అన్నాడు ప్రెసిడెంటు. ఆయన కళ్ళు అగ్నిగోళాల్లా ఎర్రగా మండు తున్నాయి. ఆయన నుండి సన్నగా తీయని మధువుగాలులు వీచాయి. విషయం తెలియటాని కెంతోసేపు పట్టలేదు చంద్రంకు ప్రస్తుతం ప్రెసిడెంటుగారు చంద్రలోకాల్లో, మధుర (వు) లోకాల్లో విహరిస్తున్నా రన్నమాట.

"మరి స్కూలుకి ఎప్పుడొస్తారండీ ?"

"డి. ఐ. గారు లేరు - సాయంత్రమే వెళ్ళిపోయారు"

"వెళ్ళిపోయారా ? స్కూలుకి రాకుండానే ." చంద్రంలో ఆశ్చర్యం.

"హుఁ స్కూలు చూడనవసరం లేదు - మా మాటలమీద ఆయనకి బాగా నమ్మకం. అన్ని విషయాలు నేనే మాట్లాడాను"

"హెడ్ మాస్టర్ గా నేనా యన్ని చూడక్కర్లేదా"

"నువు కొత్తవాడివి, కుర్రవాడివి ఏ కీలాటి విషయాలు తెలియవు. నీవిక వెళ్ళొచ్చు"

ప్రెసిడెంటుగారి కంఠంలో నిర్లక్ష్యత, అహం భావం చూస్తున్న చంద్రం హృదయం మరుగుతోంది.

కానీ : తను నిస్సహాయుడు.

ఆయన మాటలకి ఎదురు చెప్పకూడదు

వెనక్కి తిరిగి వచ్చేశాడు చంద్రం అతని కళ్ళముందు డి. ఐ గారు, ప్రెసిడెంటు మార్చి మార్చి తిరుగుతూన్నారు.

"మన విద్యా విధానాలు మారాలి."

"విద్యార్థులలో నవ చైతన్యం కలగాలి."

"భావి భారతదేశం సస్యశ్యామలంగా మారాలి. ఇవన్నీ చెవిటివాడి వద్ద శంఖం ఊదినట్లున్నాయి.

"బాబుగారు ; ఇయ్యాల ప్రెసిడెంటు గారింట్లో యిందు భోజనం భలేగ జరిగింది లెండి, ఎన్ని కోళ్ళు ? ఎన్ని మందుబుడ్డు ; అబ్బో !— చెప్పలేను. "ఇనస్పెకరుగారు నడవలేకపోయారంటే నమ్మండి !"

పాలేరు వెంకడు ఉషారుగా చెప్పుకు పోతున్నాడు. చంద్రంకు అగ్నిలో ఆజ్యం పోసినట్లున్నాయి వాడి మాటలు.

మరునాడు సాయంత్రం తోటలో పిచ్చిగా తిరుగుతూన్న చంద్రంకు నీరజ ఎదురైంది.

"మాస్టారూ ;"

నీరజ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"మాస్టారూ ; నిన్న సాయంత్రం రాలే దేమిటి :"

"ఏమీ లేదు. కాస్త పనుండి రాలేక పోయాను." చంద్రం అన్నాడు.

"అలా దాచేయకండి మాస్టారు ; నా ముఖం చూడటం మీ కిష్టంలేదు."

"అంతమాటనకు నీరూ : — మంచులా నిర్మలంగా ఉన్న నీ ముఖం నా హృద యంలో ప్రశాంతత నిస్తుంది."

"మాస్టారూ ."

సంతోషానందాలు పరవళ్ళు త్రొక్కాయి నీరజలో.

"నిజం... నిజూ ,"

చటుక్కున ముందుకు వంగి చంద్రం పెదాలమీద సుతారంగా ముద్దు పెట్టుకుంది నీరజ. ఈ హఠాత్పరిణామానికి ఉలిక్కిపడ్డాడు చంద్రం.

"తొందరపడ్డావు నీరూ — ఈ దృశ్యం ఎవరి కంటనైనా పడితే పర్యవసానం ఏమవుతుందో ఆలోచించావా?"

"తొందరపాటు కాదు మాస్టారు! మీ మనసు తెలుసుకున్నందుకు ఆనందం పట్టలేక పోయాను. నా జీవితం సార్థకమైంది. మీరు తోడుగా ఉంటె ఈ లోకమంతా ఏకమై దండెత్తి వచ్చినా మనల్ని ఏమి చేయలేదు."

"నీరూ! నీలాంటి సుగుణాలు నా జీవిత భాగస్వామి అయితే నా జీవితం సార్థకం అవుతుంది. దేవుడే దిగి వచ్చి వరమడిగినా అంతకంటే వేరొక వరం కోరుకోను... నీరూ!"

నీరజకి చంద్రం మెదుస్న ఆరాధనని చూడగానే లోకాన్ని జయించగలనన్న పిచ్చి ధైర్యం ఒక్కసారిగా ఆవహించినట్లయింది.

కానీ —

చంద్రం ఊహించినట్లుగా ఆ దృశ్యం రామయ్య పంతులు కళ్ళలో పడటం. టెలి ఫోనులా ప్రెసిడెంటుగారి చెవిలో పడటం వెంట వెంటనే జరిగిపోయాయి.

ఆరోజు!

అర్ధరాత్రవుతూండగా తలుపు చప్పుడైతే లేచి తలుపు తీసిన చంద్రం ఎదురుగా, భీకరంగా, దెబ్బతిన్న పులిలా, నిల్చుని ఉన్న ప్రెసిడెంటుని చూసి ప్రక్కలో బాంబు పడ్డవాడిలా అదిరిపడ్డాడు.

"రేయ్! — నేనెవరో నీకు తెలుసా?" సింహ గర్జనలా ఉన్నాయి ఆయనమాటలు. చంద్రం జవాబు చెప్పలేదు.

"నేనంటే .... పదూళ్ళలో పిట్ట కూడా నీళ్ళు త్రాగదు. తెలుసా? ట్యూషన్ చెప్పమంటే ప్రేమపాఠాలు చెబుతావా? ఆం... కొడకా! నీవెంత? నీ అర్హతెంత? నీ కులమేమిటి? గోత్రమేమిటి? నిమ్న క్షణాల్లో నామరూపాల్లేకుండా చేయగలన్రా —"

చంద్రం నవ్వేడు. ఆ నవ్వు మేకపోతు గాంభీర్యంలా ఉంది.

"ప్రెసిడెంటుగారు! మీరు ఎన్నయినా చేయగలరు కాని మా యిద్దరి మధ్యనున్న అనురాగ బంధాన్ని మీరు తెంచగలరా?.... ఊహూ! అది మీ తరంగాదు —"

"అలాగేంట్రా! దొంగ వెధవ! చూస్తాన్రా!" వచ్చినంత వేగంగా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళిపోయాడు.

చంద్రం తలుపు వేసుకుని మంచంమీద పడుకున్నాడు. అతని మనస్సంతా ఆందోళనగా ఉంది. తనూహించినంతా జరిగింది.

నీరజ ప్రేమని తను కాదనలేడు.

నీరజ అనురాగం లేనిది తను జీవించలేడు.

నీరజని ప్రేమించటం తన తప్పా?

తన మతం వేరయినంత మాత్రాన ప్రేమకు అర్హత లేదా?

ప్రేమకు ఆస్తులు — అంతస్తులు — అర్హతలా ఉన్నాయా?

ప్రజల్లో ఈ ఆదర్శం ఎప్పుడు కలుగుతుంది? ప్రజల హృదయాల్లో ఈ అడ్డుగోడలు ఎప్పుడు తొలగి పోతాయి?

నీరజ తనది కాగలదా?

అంతటి అదృష్టం తనకుందా?

ఏమో!

మంచం మీద పడుకుని కళ్ళు మూసుకున్నాడన్న మాటేగాని కంటి మీద కునుకు పడలేదు. ఎందుకో ఆ క్షణంలో తను అనుకోకుండానే తన వాళ్ళంతా మనసులో మెదులుతున్నారు. తన తమ్ముళ్ళు తనతో మాట్లాడుతున్నట్టే ఉంది.

అలాగే కళ్ళుమూసుకున్న చంద్రం ఏదో అలికిడి అవటంతో ఉలిక్కిపడి కళ్ళు

తెరిచి చూశాడు.

అంతలోనే అదిరిపడ్డాను—

ఎర్రగా, రాకాసిలా, మంటలు ఎగిసి పడుతూ మారింతా ఆక్రమించుకుంటోన్నాయి.

చంద్రం గుండెలు అదిరాయి—

ఎలా అంటుకుంది యిల్లు?

ఎవరు చిచ్చు పెట్టారు?

ఈ పని ప్రెసిడెంటు చేసింది కాదుగదా—

పరుగెత్తి తలుపు తెరవబోయాడు చంద్రం. కాని — అవతలి వేపు గొళ్ళెం పెట్టి వుంది. తలుపులు రాలేదు—

చంద్రంకు ముచ్చెమటలు పోశాయి—

తనిలా మంటల్లో సజీవ దహనం కావలసిందేనా?—

తనవాళ్ళు అనాథలు కావలసిందేనా?

ప్రేమించిన సేవకి ఇంతటి ఘోర శిక్షా?

భగవాన్! తనవాళ్ళకి అన్యాయం చేయవద్దు!—

చంద్రం హృదయం నిశ్శబ్దంగా రోధిస్తూంది.

కాని,

చంద్రం మొర ఆలకించేందుకు దేవుడు దిగి రాలేదు.

చంద్రం చూస్తుండగానే మంటలు రాకాసి నాల్కల్లా చుట్టుముట్టాయి.

కొన్ని క్షణాల తర్వాత—

చంద్రం వేసిన, కేక "అమ్మా" అంటూ, హృదయ విదారకంగా, భయంకరంగా చుట్టుప్రక్కలకి వినిపించింది.

* *

వారం రోజుల తర్వాత దినపత్రికలో పెద్ద పెద్ద అక్షరాలతో ఇలా ప్రచురింపబడింది.

"హెడ్మాస్టరు సజీవ దహనం"

ఆకస్మాత్తుగా, ప్రమాదవశాత్తు, నిద్రిస్తున్న హెడ్మాస్టరు శ్రీ జము. చంద్ర మోహన్ యింటికి నిప్పంటుకుని ఘోరంగా సజీవ దహనం కావింపబడ్డారు.

ఆయన మృతికి సంతాప సూచకంగా, ఆ ఊరి ప్రెసిడెంటుగారు సభ జరిపారు. శ్రీ చంద్రం చాలా మంచి ఆదర్శ ఉపాధ్యాయుడని వయస్సులో చిన్నవాడైనా కార్యదక్షతతో మిన్నయని శ్లాఘిస్తూ వారి కుటుంబానికి రెండు వేల రూపాయలు విరాళం ఇచ్చారు. ఆ ఊళ్ళోని ప్రజలంతా సభకు హాజరై రెండు క్షణాలపాటు మౌనవ్రతం పాటించారు.

ఒక అధికారి ఆనాటి సభకు హాజరయ్యారు. ఉపాధ్యాయుని మీద ఆ ఊరి ప్రజలకుగల గౌరవాన్ని ఆయన పొగిడారు. ప్రెసిడెంటుగారి ఔదార్య బుద్ధికి అచ్చెరువు పొందారు ఆయన. "ఈనాడు యిలాంటి గ్రామాలే దేశసౌభాగ్యాలకు మూలస్తంభాలని, దానికి వెన్నెముకలని" ప్రశంసించారు.

ఇంకా, యిలాంటి ఔదార్యబుద్ధి, సేవానిరతిగల గ్రామ ప్రెసిడెంటు దేశానికి ఎంతో ముఖ్యమైన వారని" అన్నారు.

అంతటితో సభ ముగిసింది.

